సాక్షి
కాకినాడ

శనివారం | 23 | ఆగస్టు | 2025



ఖర్చును కంట్రోల్ చేద్దాం

జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు మనకు వివిధ ప్రాంతాల్లో టోల్‌గేట్లు కనిపిస్తాయి. అక్కడ టోల్ (చార్జీ) చెల్లించి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. -8లో



క్షమాపణ చెప్పలేదని హత్య

రాజమహేంద్రవరంలోని కైలాసభూమి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ధవళేశ్వరానికి చెందిన సతీష్ కుమార్‌ది హత్యగా తేలింది. -8లో

వీరేశ్వరస్వామికి రూ.లక్ష విరాళం



ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయానికి టి.ఉపేంద్రరావు శ్రీదేవి దంపతులు (నరసన్నపేట) రూ. లక్ష విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

ఆర్డీఓకు అస్వస్థత



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందిన ఆర్డీఓ మల్లిబాబు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను పురస్కరించుకొని శుక్రవారం బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సమయంలో కాకినాడ ఆర్డీఓ ఎస్. మల్లిబాబు అస్వస్థతకు గురయి ఒకసారిగా కుప్పకూలి పోయారు. వెంటనే ఆర్డీఓ సిబ్బంది స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ట్రస్టు ఆస్పత్రికి తరలించామని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. బీపీ కారణంగా అస్వస్థతకు గురి అయినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని డాక్టర్లు తెలిపారు.

నేడు పెద్దాపురంలో ముఖ్యమంత్రి పర్యటన

సామర్లకోట: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దాపురంలో పర్యటిస్తున్నట్లు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఆర్ కృష్ణకపర్ది ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని లేఅవుట్‌లోని ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్‌లో దిగుతారు. అక్కడి నుంచి పెద్దాపురంలోని 10వ వార్డు నిర్మాణం చేసిన మేజిక్ డ్రైన్‌ను, స్వచ్ఛ రథంను సందర్శిస్తారు. శానిటరీ వర్కర్లకు ఇన్సూరెన్సు కిట్లు అందజేస్తారు. స్వచ్ఛ ర్యాలీలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.40 వరకు సామర్లకోట–పెద్దాపురం రోడ్డులోని లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్ద స్టాల్స్ విజిట్ చేసి అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సమీపంలో ఉన్న పూర్ణా కల్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం హెలికాప్టర్‌లో తాడేపల్లి చేరుకొంటారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రత్తిపాడు: పెద్దాపురం, ఎటపాకలలోని పీఎం శ్రీ జవహర్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతిలోకి ఉచిత ప్రవేశాల కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. పెద్దాపురం నవోదయ విద్యాలయ పరిధిలోని పెద్దాపురం, కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, సామర్లకోట, పెదపూడి, జగ్గంపేట, కాజులూరు, కిర్లంపూడి, కరప, తాళ్లరేవు, పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ కొత్తపల్లి, గండేపల్లి మండల పరిధిలోని వారు, ఎటపాక నవోదయ విద్యాలయకు తుని, తొండంగి, కోటనందూరు, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం మండలాలకు చెందిన విద్యార్థులు 2026–27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మొదలైందని చెప్పారు. ఆఖరు తేదీ ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రదానోపాధ్యాయులు అర్హత కలిగిన విద్యార్థులను ఈనెల 27 లోగా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు.

25న జాబ్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఈ నెల 25వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి జి.వసంతలక్ష్మి శుక్రవారం తెలిపారు. అశోక్ లేలాండ్ సంస్థ 40, టీమ్‌లీజ్ సర్వీస్ (బ్యాంక్ సర్వీస్) 220, పేటీఎం 200, సోలార్ సిస్టమ్ 100, క్రెడిట్ యాక్సెస్ 300 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. పదవ తరగతి ఆపైన ఐటీఐ, డిప్లమో, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు హాజరుకావవచ్చని, ఇతర వివరాలకు 86398 46568 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

టీచర్ల అంతర్ జిల్లాల బదిలీల షెడ్యూల్ విడుదల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు (భార్యాభర్తలు, పరస్పర అంగీకారం చేసుకునేవారికి మాత్రమే) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల24 వరకు ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు ఫారం ప్రింటవుట్‌లను సంబంధిత మండల విద్యాశాఖాధికారికి సమర్పించాలన్నారు. 22 నుంచి 25 వరకు మండల విద్యాశాఖాధికారి ధ్రువీకరిస్తారన్నారు. 28, 29 తేదీలలో పాఠశాల విద్యా డైరెక్టర్ కార్యాలయంలో తుది నిర్ధారణ జరుగుతుందన్నారు.

రైతులకేదీ రుణ భరోసా?



- డీసీసీబీ ద్వారా అందని అప్పులు
- రుణ పంపిణీ లక్ష్యం రూ.780 కోట్లు
- ఇచ్చినది రూ.510 కోట్లు మాత్రమే
- సగం మందికి అందని వైనం
- ప్రైవేటు వ్యాపారులే దిక్కు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రుణాలు అందక, ప్రభుత్వం నుంచి భరోసా లేక రైతులకు వ్యవసాయం చేయడం రానురాను మరింత కష్టంగా పరిణమిస్తోంది. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటూ అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో పాలన సాగించింది. విత్తు నుంచి పంట విక్రయాల వరకూ రైతు భరోసా కేంద్రాల ద్వారా తోడ్పాటు అందిస్తూ వ్యవసాయాన్ని పండగ చేసింది. బ్యాంకర్లకు ప్రభుత్వమే హామీ ఉంటానని భరోసా కల్పించి రైతులకు పెద్ద ఎత్తున రుణాలు అందించేందుకు అప్పటి సర్కారు చర్యలు చేపట్టింది. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కాకినాడ జిల్లాలో డీసీసీబీ పరిధిలో రెండు లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. వీరిలో 90 వేల మందికి ఈ ఖరీఫ్ సీజన్‌లో రుణాలు ఇచ్చింది. మిగిలిన రైతులకు రుణాలు ఇవ్వలేదు. కొన్ని సహకార సంఘాల పరిధిలో అసలు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు ప్రయివేటు బ్యాంకుల్లోను, వడ్డీ వ్యాపారుల వద్ద రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద సంవత్సరానికి రూ.13,500 మూడు దఫాలుగా వారి ఖాతాల్లో జమ చేయడంతో పెట్టుబడి సాయంగా ఉపయోగపడేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ప్రతీ ఏడాది రైతుకు రూ. 20 వేలు ఇస్తామని కల్లబొల్లి మాటలు చెప్పింది. గత ఏడాది ఒక్క రూపాయి కూడా ఇవ్వని ప్రభుత్వం ఈ ఏడాది రూ.5 వేలు మాత్రమే రైతులు ఖాతాలో జమ చేసింది. దీంతో రైతులు పెట్టుబడి సహాయం అందక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు కోసం సహకార సంఘాలు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఖరీఫ్‌లో రూ.780 కోట్లు మాత్రమే రుణాలు

కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రూ.780 కోట్లు లక్ష్యం పెట్టుకోగా దీనిలో రూ.510 కోట్లు మాత్రమే రుణాలు ఇచ్చారు. దాదాపు సగం మంది రైతులకు మాత్రమే ఈ ఏడాది ఖరీఫ్‌లో రుణాలు అందాయి. మిగిలిన రైతులకు రుణాలు అందకపోవడంతో బయట అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు సహకార సంఘాలకు వెళ్లినా అక్కడ రుణాలు ఇచ్చేందుకు పలు కొర్రీలు పెట్టడంతో విసుగుచెంది బయట వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని మరీ ఈ సీజన్‌లో సాగు చేశారు.

మరింతగా అప్పుల్లో కూరుకుపోయిన రైతులు

గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఈ సీజన్‌లో రైతులు రుణాలు ఇచ్చేందుకు సహకార సంఘాలు ముందుకు రాకపోవడంతో రైతులు బయట వ్యాపారులను ఆశ్రయించారు. దీనికితోడు ఈ ఏడాది రబీ సీజన్ మొత్తం ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటల దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో పెట్టుబడులు కూడా రాకపోవడంతో అధిక వడ్డీలు కట్టి అప్పులు పాలు కావాల్సిన పరిస్థితి నెలకొంటుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

తగ్గిన రుణ పరిమితి

కొన్ని సహకార సంఘాల పరిధిలోని రైతులకు అసలు రుణాలు ఇచ్చేందుకు ఆయా సహకార సంఘాలకు చెందిన అధికారులు సుముఖత చూపలేదు. ఆయా సహకార సంఘాల పరిధిలో గతంలో రుణాలు తీసుకొని చెల్లించని కారణంగా ఆయా సహకార సంఘాలకు డీసీసీబీ రుణ పరిమితి తగ్గించడంతో రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో రుణాలు అందని పరిస్థితి ఉంది. పెద్దాపురం మండలం కాండ్రకోట, కిర్లంపూడి సహకార సంఘం, లంపకలోవ, జగ్గంపేట మండలాల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు ఆయా సహకార సంఘాలకు చెందిన అధికారులు ముందుకు రాలేదు. దీంతో ఆయా సహకార సంఘాల పరిధిలో సుమారు 10 వేలమందికిపైగా రైతులు సక్రమంగా రుణాలు అందక అవస్థలు పడ్డారు.

కౌలు రైతుల పరిస్థితి మరీ అధ్వానం

ఈ ఏడాది కాకినాడ జిల్లాలో సుమారు 40 వేలకు పైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. కానీ అవి అలంకార ప్రాయంగానే మిగిలిపోయాయి. ఒక్క రైతుకు కూడా ఈ సీజన్‌లో రుణం ఇవ్వడానికి ఏ బ్యాంకూ ముందుకు రాలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఇబ్బంది లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు. ప్రతీ సీజన్‌లోను సుమారు 60 వేల మందికి రుణాలు ఇచ్చారు. ఒక్కొక్క కౌలు రైతుకు రూ.50 వేలకు తక్కువ కాకుండా రుణాలు అందించారు. కానీ ప్రస్తుతం కౌలు రైతులకు ఈ కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా రుణం ఇచ్చిన దాఖలాలు లేవు. ప్రయివేటు బ్యాంకులైతే సవాలక్ష డాక్యుమెంట్లు కావాలని అడ్డంకులు పెడుతోందని భావించి గత ప్రభుత్వం డీసీసీబీ బ్యాంకుల ద్వారా కేవలం కౌలు గుర్తింపు కార్డు ఉన్న రైతుకు విరివిగా రుణాలు అందించింది. ప్రస్తుతం రుణాల మంజూరుకు డీసీసీబీ బ్యాంకులు సైతం వెనుకడుగు వేయడంతో కౌలు రైతులు మరింత అప్పుల పాలయ్యారు. రైతుకు శిస్తు చెల్లించి, పెట్టుబడుల కోసం ప్రయివేటు వ్యాపారస్తులు దగ్గర అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి ఈ సీజన్ సాగు చేసుకొన్నారు.

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు



కూటమి ప్రభుత్వంలో రైతులను పట్టించుకోవడం లేదు. రుణాల కోసం సహకార సంఘాల ఆఫీసులకు తిరిగి తిరిగి అలసిపోయి బయట వ్యాపారుల వద్ద రుణాలు తెచ్చుకొని ఈ రబీ సీజన్‌లో సాగు చేశాం. అధిక వడ్డీల కారణంగా ఈ సీజన్‌లో పెద్దగా ఏమీ రాలేదు. కనీసం ఖరీఫ్ సీజన్‌లోనైనా రైతులకు రుణాలు ఇవ్వాలి.

– అడబాల గోవిందు, రైతు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

గతంలో రుణాలు బాగానే ఇచ్చేవారు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు బాగానే రుణాలు ఇచ్చేవారు. ప్రస్తుతం రుణాలు అడిగినా సహకార సంఘాల అధికారులు సరైన సమాధానం చెప్పలేదు. పాత రుణాలు రెన్యువల్ చేయడం తప్ప కొత్తవి ఇవ్వలేదు. దీంతో రుణాల కోసం ప్రయివేటు వ్యక్తులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది.

– బందే వీరబాబు, రైతు, వేములవాడ కరప మండలం

వరలక్ష్మీ నమోస్తుతే..

- రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
- పాల్గొన్న 9,680 మంది మహిళలు



ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు



వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

అన్నవరం : నిత్యం సత్యదేవుని నామజపంతో మార్మోగే రత్నగిరి శ్రావణమాసం ఐదో శుక్రవారం మాత్రం వేలాదిగా వచ్చిన మహిళల వరలక్ష్మీ నామజపంతో మార్మోగింది. దేవస్థానంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంతో బాటు నాలుగు, ఐదో నంబర్ వ్రత మండపాలు, వాయవ్య, నైరుతి వ్రత మండపాలలో ఈ వ్రతాలు నిర్వహించారు. మొత్తం ఎనిమిది బ్యాచ్‌లలో 9,680 మంది మహిళలు ఈ వ్రతాలు ఆచరించారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ రత్నగిరి ఆలయ ప్రాంగణం మహిళలతో కిటకిటలాడింది. ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం పండితులు విఘ్నేశ్వరపూజ, కలశస్థాపన, శ్రీసత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య కల్యాణ మండపం వేదిక మీద ప్రతిష్ఠించిన వరలక్ష్మీ అమ్మవారికి ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం పూజలు చేసి హారతి ఇచ్చారు. కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు మహిళలతో వరలక్ష్మీ వ్రతం చేయించారు. వరలక్ష్మీ వ్రతకథను పాలంకి పట్టాభిరామ్మూర్తి చదివి వినిపించారు. హాజరైన మహిళలకు ఉచితంగా జాకెట్టుముక్క, సత్యదేవుని ప్రసాదం, అమ్మవారి రాగిరూపు, చేతికి కట్టుకునే తోరం అందజేశారు. నిత్యాన్నదాన పథకంలో వీరికి భోజన సౌకర్యం కలుగజేశారు. మహిళలు గంటల తరబడి క్యూ లో నిలబడాల్సి వచ్చింది. దాంతో ముగ్గురు మహిళలు సొమ్మసిల్లి పడిపోగా వారిని వ్రతాల ఆఫీసులోకి తరలించి తోటి మహిళలు సపర్యలు చేశారు. అధికారులు రామాలయం వద్ద గల వార్షిక కల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహించి ఉంటే గంటల తరబడి మహిళలు వేచియుండే అవసరం ఉండేది.

నిరాశతో వెను తిరిగిన భక్తులు

- చివరి వారం వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించరని తెలియక అవస్థలు
- పంచారామ క్షేత్రం వద్ద పరిస్థితి



వ్రతాలు లేకపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోతున్న మహిళలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామభీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా చివరి శుక్రవారం రోజున సామూహిక వరలక్ష్మీ వ్రతాలు రద్దు చేసిన విషయం తెలియక ఆలయానికి వచ్చిన అనేకమంది మహిళా భక్తులు వెనుతిరిగి వెళ్లిపోయారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం మినహా మిగిలిన అన్ని శుక్రవారాలలోను 15 ఏళ్లుగా పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం రెండు, నాల్గవ శుక్రవారాల్లో మాత్రమే పంచారామ క్షేత్రం సామూహిక వ్రతాలు ఏర్పాటు చేశారు. అయితే ఈ విషయం తెలియని అనేకమంది మహిళలు చివరి వారంలోను సామూహిక వ్రతాలు జరుగుతాయని భావించి ఆలయానికి తరలి వచ్చారు. వ్రతాలు నిర్వహించడం లేదని తెలిసి మహిళలు నిరాశతో వెనుతిరిగి వెళ్లి పొయారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో ప్రైవేటుగా వ్రతాలను నిర్వహించుకున్నారు.

మొట్టమొదటి మధ్యవర్తి శ్రీకృష్ణుడే



సామవేదం షణ్ముఖ శర్మను సత్కరిస్తున్న సూర్యకుమారి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఈ లోకంలో మొట్టమొదట మధ్యవర్తి శ్రీకృష్ణుడేనని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. స్థానిక సూర్యకళామందిరంలో సరస్వతి గాన సభ ఆధ్వర్యంలో «సనాతన ధర్మం–శాశ్వత న్యాయం» అంశంపై ఐదు రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు శుక్రవారంతో ముగిశాయి. మన యోగ్యతను బట్టి మనకు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. ధర్మరాజు నారదుడితో యథాశక్తి, యథావిధిగా చెప్పిన సనాతన ధర్మాన్ని మనం పాటించాలన్నారు. మన పూర్వీకులు ఈ విధానాన్నే ఆచరించారన్నారు. సత్యానికి కట్టుబడి ఉండడం, ఒడంబడికలకు విలువ ఇవ్వడం, మాటకోసం, సత్యం కోసం కట్టుబడడమే మన సంస్కృతి అన్నారు. గర్భవతి అయిన స్త్రీ తన సంతానం కాపాడుకోవడానికి తనకిష్టమైన కొన్నింటిని ఎలా వదులుకుంటుందో పరిపాలకులు కూడా అలా ఉండాలన్నారు. అనంతరం సరస్వతీ గానసభ ఆధ్వర్యంలో సామవేదం షణ్ముఖ శర్మను సత్కరించారు. సరస్వతీ గాన సభ గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్యకుమారి, అధ్యక్షుడు పేపకాయల రామకృష్ణ పాల్గొన్నారు.

పాదగయ వరలక్ష్మీ వ్రతాల్లో
మహిళలకు ఇక్కట్లు

- నిర్వహణలో జనసేన నేతల వైఫల్యం
- సౌకర్యాలు కల్పించని అధికారులు



మండుటెండలో ఆపసోపాలకు గురవుతూ క్యూలో నిల్చున్న మహిళలు

పిఠాపురం: పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉంది పిఠాపురం పాదగయ క్షేత్రంలో శుక్రవారం జనసేన నాయకుల ఆధ్వర్యంలో సాగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణ. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆఖరి శ్రావణ శుక్రవారం సందర్భంగా నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు రసాభాసగా ముగిశాయి. వేల మందికి చీరలు సిద్ధం చేసామని జనసేన నేతలు విస్తృత ప్రచారం చేయడంతో శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు పాదగయ క్షేత్రంకు చేరుకుని క్యూ లో వేచి చూశారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమైనట్లు పలువురు భక్తులు ఆరోపించారు. విడతల వారీగా పూజలు నిర్వహించడంతో క్యూ లో గంటల తరబడి నిలబడాల్సి రాగా మంచినీరు కూడా అందక మహిళా భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు సైతం పూర్తిగా అందక పోవడంతో భక్తులు ఆందోళనకు దిగారు. కేవలం కొంత మందితో పూజలు పూర్తి చేసి మిగిలిన వారికి చీరలు మాత్రమే ఇస్తామని, పూజలు ముగిసిపోయాయని ఆలయ అధికారులు ప్రకటించడంతో క్యూలో వేచి ఉన్న భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మరోపక్క పూజలకు వచ్చిన మహిళలలో కొంత మందికి చీరలు ఇచ్చి ఇక అయిపోయాయని చెప్పిన జనసేన నేతలు చాటుగా చీరలను బయటకు తరలించే ప్రయత్నం చేయడంతో మహిళలు వాటిని అడ్డుకున్నారు. తమకు పూజ చేసుకునే అవకాశం ఇస్తామని చెప్పడంతో ఆశతో వచ్చామని, పూజలు లేకుండా చేయడంతో పాటు చీరలు కూడా ఇవ్వకుండా పట్టుకెళ్లి పోతారా అంటు జనసేన నేతలపై మండిపడ్డారు. దీంతో జనసేన నేతలకు మహిళలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పూజల్లో పాల్గొన్న మహిళలకు జనసేన నేతలు అన్య మతస్తులతో చీరలు పంపిణీ చేయడంపై భక్తులు మండిపడ్డారు. కనీసం బొట్టు కూడా పెట్టుకోని మహిళా నేతతో హిందువులకు చీరలు ఎలా పంపిణీ చేయించారంటూ జనసేన నేతల తీరును మహిళలు దుయ్యబట్టారు.


ముగిసిన గిరిజన ప్రాచీన విజ్ఞాన సదస్సు



పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్స్ అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో 'గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ – భవిషత్ తరాలకు చేర్చడం' అనే అంశం పై రెండు రోజులుగా జరుగుతున్న సదస్సు శుక్రవారంతో ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. ఇథోపియా, ఇరాక్ వంటి దేశాల నుంచి వచ్చిన పరిశోధకులతోపాటు వివిధ అంశాలపై 65 మంది పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. వీటి నుంచి ఉత్తమ పరిశోధనలుగా ఎంపిక చేసిన 40 పరిశోధన పత్రాలతో ఒక పుస్తకాన్ని ముద్రించదలచామన్నారు. పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర, కో కన్వీనర్లు డాక్టర్ ఎం. గోపాలకృష్ణ, డాక్టర్ ఎలీషాబాబు, డాక్టర్ కె.రాజామణి, డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ ఎన్.సుజాత, రాజేశ్వరీదేవి, సమన్వయ కర్త డాక్టర్ సాంబశివరావు పాల్గొన్నారు.

గాజుల గౌరీదేవిగా సుబ్బాలమ్మ



అమలాపురం టౌన్: అమలాపురంలో కొలువైన సుబ్బాలమ్మ అమ్మవారు శుక్రవారం గాజుల గౌరీదేవిగా దర్శనమిచ్చారు. సుమారు 45 వేల గాజులతో అమ్మవారిని అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో దాదాపు 600 మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమాన్ని ఈవో ఆర్.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వ్రతాలు ఆచరించే మహిళలకు వరలక్ష్మి రూపు, పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చింది. దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అమ్మవారి గాజుల అలంకరణకు భక్తులు గాజులు సమర్పించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెద్దిరెడ్డి సాయి పుల్లయ్య నాయుడు, యర్రంశెట్టి మూర్తి, అరిగెల బాబ్జీ, నిమ్మకాయల నాయుడు తదితరుల ఆధ్వర్యంలో అలంకరణ జరిగింది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అప్పన వీరన్న, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఖర్చును కంట్రోల్ చేద్దాం


టోల్‌గేట్



ఫాస్టాగ్

- టోల్ గేట్ల ఫీజు బాధ తప్పినట్టే
- అమల్లోకి పాస్ విధానం
- రూ.3 వేలతో పొందే అవకాశం
- ఏడాది లేదా 200 ట్రిప్పులకు చెల్లుబాటు

ఐ.పోలవరం: జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు మనకు వివిధ ప్రాంతాల్లో టోల్‌గేట్లు కనిపిస్తాయి. అక్కడ టోల్ (చార్జీ) చెల్లించి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. నాలుగు చక్రాలు, ఆపైన పెద్ద వాహనాలన్నీ ఈ టోల్ కట్టాల్సిందే. మనం వెళ్లే దారిలో ఎన్నిచోట్ల టోల్ గేట్లు ఉంటే అక్కడ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కో ట్రిప్పుకు (టోల్‌గేటు) ఇరువైపులా కలిపి రూ.90 నుంచి 200 వరకు ఖర్చవుతుంది. కానీ ఇక నుంచి ఆ భారం లేకుండా జాతీయ ఉపరితల రవాణా సంస్థ (ఎన్‌హెచ్) స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఏడాది పాస్ విధానం తీసువచ్చింది. కార్లు, జీపులు, వ్యాన్లు తదితర వాణిజ్యేతర వాహనాలకు ఇది వర్తిస్తుంది. ఒక్కసారి పాస్ తీసుకుంటే ఏడాది పాటు, లేదా 200 ట్రిప్పులకు అవకాశం ఉంటుంది. ఒక టోల్‌గేట్ దాటితే ఒక ట్రిప్పుగా పరిగణిస్తారు. ఆ దారిలో నాలుగు గేట్లు దాటి, తిరిగి వెనక్కి వస్తే ఎనిమిది ట్రిప్పులు అయినట్టు లెక్క.

దేశవ్యాప్తంగా 1,150 టోల్ గేట్లు

గతంలో నగదు రూపంలో టోల్ ఫీజు వసూలు చేయగా, ఆ తరువాత ఫాస్టాగ్ వచ్చింది. దీని వల్ల టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ చాలా వరకూ తగ్గిపోయింది. దేశ వ్యాప్తంగా సుమారు 1,150 వరకు టోల్ గేట్లు ఉన్నాయని అంచనా. కోనసీమ జిల్లాలో 216 జాతీయ రహదారిపై ముమ్మిడివరం మండలం అయినాపురం వద్ద, 216 ఏ జాతీయ రహదారిపై రావులపాలెం మండలం ఈతకోట వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో ఎన్‌హెచ్ 216పై గొల్లప్రోలు వద్ద, ఎన్‌హెచ్ 16పై కృష్ణవరం వద్ద ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొవ్వూరు, నల్లజర్ల వద్ద టోల్‌గేట్లు కనిపిస్తాయి.

పాస్ పొందే విధానం

ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్న వాహన యజమానులు తమ ఖాతా నుంచి ఫాస్టాగ్ పాస్ పొందవచ్చు. ఆగస్టు 15 నుంచి పెద్ద ఎత్తున వీటిని కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ పాస్ సొంత కార్లు, వాహనాలకు మాత్రమే వర్తిస్తోంది. బస్సులు, టాక్సీలు, లారీలు, రవాణా, వాణిజ్య వాహనాలకు చెల్లదు. ట్రావెల్స్‌కు వినియోగించే కార్లకు, జీప్‌లకు, వ్యాన్‌లకు కూడా వర్తించదు. ఈ ఫాస్టాగ్ ఏడాది పాస్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారులలోని అన్ని టోల్ ప్లాజాలలో పని చేస్తుంది. అయితే ఉత్తరాదిన కొన్ని ఎక్స్‌ప్రెస్ హైవేలపై కూడా ఇది వర్తించదని తాజాగా ఎన్‌హెచ్ ప్రకటించింది.

ఉపయోగాలు ఇవే

కేంద్ర రవాణా, ఉపరితల మంత్రిత్వ శాఖ ఈ ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను ప్రవేశపెట్టింది. జాతీయ రహదారిపై సొంత వాహనాల్లో ప్రయాణించే వారికి దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా ప్రయాణంలో టోల్ గేట్ భారం బాగా తగ్గించుకోవచ్చు. ఉదాహరణకు కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నుంచి విజయవాడ, రావులపాలెం మీదుగా సొంత కారులో వెళ్లి వస్తే, ఇప్పుడున్న టోల్ చార్జీలను బట్టి నాలుగు టోల్ గేట్ల వద్ద దాదాపు రూ.565 వరకు చెల్లించాలి. కానీ వార్షిక ఫాస్టాగ్ కొన్నవారికి కేవలం రూ.120 మాత్రమే అవుతుంది. అదే అమలాపురం నుంచి విశాఖపట్నం వరకు కాకినాడ, కత్తిపూడి మీదుగా వెళ్లేవారు రూ.500 వరకూ చార్జి కట్టాలి. ఇక నుంచి అది రూ.120కి తగ్గిపోతుంది. ఏడాది ఫాస్టాగ్ వల్ల సొంత కార్లు, వ్యాన్లు, జీపులు ఉన్న వారికి టోల్ చార్జీల భారం గణనీయంగా తగ్గుతుంది.

డిజిటల్ రూపంలోనూ..

ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను డిజిటల్‌గా తీసుకోవచ్చు. రాజమార్గ్ యాత్ర యాప్‌ను సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పొందవచ్చు. లేదా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా లభిస్తుంది. దీని కోసం రూ.మూడు వేలు చెల్లించాలి. సంబంధిత వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫాస్టాగ్ ఉండాలి. బ్లాక్ లిస్ట్‌లో ఉండకూడదు. సంబంధిత వాహన రిజిస్ట్రేషన్ నంబర్ వివరాలు నమోదు చేయాలి. రూ.3 వేలు చెల్లించిన తర్వాత, ఏడాది పాస్ సంబంధిత వాహన ప్రస్తుత ఫాస్ట్ ట్యాగ్‌కు లింక్ అవుతుంది. ఈ పాస్ ఒక ఏడాది కాలం, లేదా 200 ట్రిప్పులకు మాత్రమే పనిచేస్తుంది. ఈ రెండింటిలో దేని గడువు ముందు అయినా ఇక పనిచేయదు. ఈ పాస్ వల్ల టోల్ చార్జీలు బాగా తగ్గుతాయి.

వాడపల్లిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- తరలివచ్చిన మహిళలు
- పూజా సామగ్రిని సమకూర్చిన దేవస్థానం


వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న పండితులు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న క్షేత్రంలోని ఉత్తర ప్రాంగణంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. సుమారు రెండు వేల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవదాయ - ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు వాడపల్లి రవికిరణ్, ఖండవిల్లి సాయిరామకృష్ణ తదితరులు ఉదయం కల్యాణ మంటపం వేదికపై వరలక్ష్మీదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు పండితుల మంత్రోచ్చారణ మధ్య డీసీ అండ్ ఈఓ చక్రధరరావుతో పండితులు పూజ చేయించి వ్రతాన్ని ప్రారంభించారు. పూజలో పాల్గొన్న వారందరికీ వరలక్ష్మీదేవి రూపు, పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చింది. అనంతరం పండితులు విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, కుంకుమ పూజల అనంతరం పురాణ వ్యాఖ్యానం నడుమ వరలక్ష్మీదేవి వ్రతం చేయించారు.

కౌమార దశలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మి

బోట్‌క్లబ్ (కాకినాడ): బాలికలు కౌమార దశలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మి అన్నారు. గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీ తమ సామాజిక బాధ్యతలో భాగంగా గాడిమొగ, భైరవపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థినులకు కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దంటు కళా క్షేత్రంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, సీడీపీవో మాధవి మాట్లాడుతూ, కౌమార దశలో బాలికల ప్రవర్తన, వారిని ఎలా రక్షించుకోవచ్చో తెలిపారు. పదాల చారిటబుల్ ట్రస్టు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం బాలికలకు రిలయన్స్ వారు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫైనాన్స్ హెడ్ మదన్ పాల్, సీఎస్సార్ హెడ్ పోతాప్రగడ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

25న ఫెన్సింగ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఫెన్సింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు కాకినాడలోని గెజిటెడ్ ఆఫీసర్స్ భవన్‌లో జిల్లా స్థాయి అండర్ - 17 ఫెన్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి సింహాద్రి పవన్ వికాస్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న భీమవరంలోని వెస్ట్ బెర్రి స్కూల్లో జరిగే అండర్–17 ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాలకు 95535 28888 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన విద్య


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): బీసీ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల (హెచ్‌డబ్ల్యూఓ)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ హెచ్‌డబ్ల్యూవోల పనితీరును మెరుగుపరుచుకునేందుకు నూతన విధానం తీసుకువచ్చిందన్నారు. విధి నిర్వహణలను విభజించి ప్రతి దానికి కొన్ని మార్కులు కేటాయించిందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ నాటికి రాష్ట్రంలోని వసతి గృహాల్లో 244 మంది నాలుగో తరగతి సిబ్బందిని నియమిస్తామన్నారు. బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాల్లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ బీసీ వెల్ఫేర్ డీసీఎస్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పలేదని స్నేహితుడి హత్య

- ఐదుగురు యువకుల ఘాతుకం
- వీడిన కేసు మిస్టరీ
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


హత్యకు గురైన వేపాడ సతీష్ కుమార్ (ఫైల్)


నిందితులను చూపిస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని కైలాసభూమి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ధవళేశ్వరానికి చెందిన సతీష్ కుమార్‌ది హత్యగా తేలింది. ఈ ఘోరానికి పాల్పడిన అతడి ఐదుగురు స్నేహితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒకరి భార్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సతీష్ కుమార్ క్షమాపణలు చెప్పలేదనే ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. వేపాడి సతీష్ కుమార్ (22) రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో మూడేళ్లుగా సమోసాలు అమ్ముతు జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8వ రాత్రి 12 గంటల సమయంలో ఇంట్లో టీవీ ఎక్కువగా సౌండ్ పెట్టుకుని చూస్తుండగా తండ్రి మందలించడంతో అలిగి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం ఈ నెల 15న కైలాస భూమి వెనుక శవమై కనిపించాడు. ఈ మేరకు టూటౌన్ సీఐ శివ గణేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య జరిగిందిలా..

వేపాడి సతీష్ కుమార్ ఈ నెల 9వ తేదీ తెల్లవారు జామున తోటి స్నేహితులైన ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన భాగ్ రాధాకాంత్, భాగ్ గౌతం, దొంగ సాధిరాజు, బాలాజీ పేటకు చెందిన మోటూరి రవి, భీమవరానికి చెందిన నమ్మి సూర్య తేజతో కలిసి మద్యం తాగడానికి గోదావరి గట్టు దిగువనున్న కైలాస భూమి శ్మశానం లోపలకు వెళ్లాడు. వారిలో భాగ్ రాధాకాంత్ భార్యపై ముందు రోజు రాత్రి వారు కలిసిన సమయంలో సతీష్ కుమార్ చులకనగా మాట్లాడాడు. దీనిపై క్షమాపణ చెప్పాలని సతీష్ కుమార్‌ను వారందరూ అడిగారు. దానికి అతడు నిరాకరించడంతో పాటు మళ్లీ ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అప్పటికే పూర్తిగా మద్యం తాగి ఉన్న ఐదుగురూ కోపంతో సతీష్ కుమార్‌పై దాడి చేశారు. నమ్మి సూర్యతేజ పక్కనే ఉన్న కర్ర తీసుకుని తలపై కొట్టడంతో సతీష్ కుమార్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. భాగ్ రాధాకాంత్ ఆ తర్వాత అతడి పీక మీద కాలు వేసి.. మృతి చెందే వరకు గట్టిగా తొక్కాడు. అనంతరం మృతదేహాన్ని ఈడ్చుకుని వెళ్లి గోడ అవతల పారవేసి, ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసును ఛేదించారు. హత్యకు ఉపయోగించిన కర్ర, మృతుడి టీషర్టును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెరవలి: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పెరవలి ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉసులుమర్రు గ్రామానికి చెందిన ఈతకోట మునియమ్మ ఈ నెల 11వ తేదీన కొత్తపల్లి సూర్యారావు మోటార్ సైకిల్‌పై తణుకు వెళుతోంది. వారిని పెరవలిలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన మునియమ్మను చికిత్స కోసం ముందుగా తణుకు, అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆనాటి నుంచి వైద్యం అందిస్తుండగా ఆరోగ్యం విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి మహిళా కూలీ మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- గుడ్డిగూడెంలో ఘటన


సుగ్గనబోయిన పద్మ (ఫైల్)


ప్రమాద స్థలంలో ట్రాక్టర్, మహిళా కూలీ మృతదేహం


గోపాలపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

గోపాలపురం: ట్రాక్టర్ తిరగబడి మహిళా కూలీ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే. గుడ్డిగూడెం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు శుక్రవారం వరినాట్లకు వెళ్లారు. పని ముగించుకుని ట్రాక్టర్‌పై వస్తుండగా గుడ్డిగూడెం వద్ద గల కొవ్వాడ కాలువలోకి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగబడింది. ఈ ప్రమాదంలో సుగ్గనబోయిన పద్మ (42) అక్కడికక్కడే మృతి చెందగా, సుగ్గనబోయిన తాయారు, కత్తవ నాగలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. స్వల్ప గాయాలైన అద్ద పోశమ్మ, అడబాల వెంకటలక్ష్మి, సిరిగినీడి రామలక్ష్మి, కత్తవ అచ్చమ్మలకు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందజేశారు. సంఘటనా స్థలాన్ని దేవరపల్లి సీఐ కె.నాగేశ్వర్ నాయక్ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి ప్రమాద వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిల్పి రాజ్‌కుమార్‌కు పురస్కారం



కొత్తపేట: ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. జీహెచ్‌పీయూ హానరరీ అవార్డ్స్ సెర్మనీని పురస్కరించుకుని ఆయనను ఎంపిక చేశారు. చెన్నై భారతీయ విద్యాభవన్‌లో శనివారం ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమంలో వుడయార్‌కు అవార్డు అందజేస్తారు.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ అందిస్తున్న పీజీ డిప్లమా ఇన్ యోగా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశానికి ఈ నెల 29 వరకు మాత్రమే అవకాశం ఉందని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా సహకారంతో నిర్వహిస్తున్న ఈ కోర్సుల్లో ప్రవేశానికి 50 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సు చేసేందుకు వయోపరిమితి లేదని, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన స్త్రీ, పురుషులు అర్హులన్నారు. ఇతర వివరాలకు 73823 08440 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై 25న చలో కలెక్టరేట్


చలో కలెక్టరేట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాకినాడ సిటీ: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యావిధానం పేరు చెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ, కేంద్రీకరణ, కషాయీకరణ చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యారంగంలోని పెండింగ్‌లో ఉన్న రూ.64 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 77ను రద్దు చేసి, ప్రైవేట్ కాలేజీలో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేయాలని చెప్పారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచి, హాస్టల్‌కు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్షుడు ఎ.వాసుదేవ్, జిల్లా కమిటీ సభ్యులు చిన్ని, జైశ్రీరామ్, నగర నాయకులు సత్యం, ఆదర్శ్ కార్తిక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడి

ముమ్మిడివరం: మండల పరిధిలోని గేదెల్లంక గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క పది మందిని గాయపరచింది. దీంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోయారు. గత నెలలో కూడా ఇదే మాదిరిగా 8 మందిని, రెండు ఆవులను కూడా కరిచిందని, వాటిలో ఒక ఆవు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఏవీ నగరంలో..

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో ఐదుగురిపై పిచ్చికుక్క దాడి చేసింది. రెండు పశువులను తీవ్రంగా గాయపర్చింది. ఆ గ్రామంలో గంగాలమ్మ వీధిలో ఈ ఘటన జరిగింది. బాధితులకు స్థానిక పీహెచ్‌సీలో వైద్యం అందించి, అక్కడి నుంచి కాకినాడ ఆస్పత్రికి తీసుకెళ్లి వ్యాక్సినేషన్ చేయించారు. గాయపడిన వారిలో ముగ్గురు పిల్లలు ఉన్నారు.